సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రజా సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ మండల పరిధిలోని నాగాపూర్, కిషన్‌నాయక్ తండాల్లో పంచాయతీ భవనాలను, గంగాపూర్‌లో పాఠశాల అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం నిజాంపేట్ మండలం రాపర్తికి చెందిన అంతన్నగారి కిషన్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, రమేష్‌చౌహాన్, సర్పంచ్‌లు పుడ్లిక్, పల్లవి, సురేఖ, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఏరియా గవర్నర్ లక్ష్మి బసవేశ్వరరావు, ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఖేడ్‌లో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.


కిషన్‌నాయక్ తండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కంగ్టి (నారాయణఖేడ్): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. కంగ్టి మండల పరిధిలోని సాధుతండాలో రోడ్డు, తుర్కవడ్‌గాంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

సదాశివపేట(సంగారెడ్డి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ మేనేజర్‌కు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికచట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తోందని మండిపడ్డారు. అంతేకాకుండా ఎనిమిది గంటల పని విధానం నుంచి 12 గంటల పని విధానం తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈ నెల 16న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి అంజయ్య, నాయకులు చౌదరి మన్నేష్, కృష్ణ, శ్రీనివాస్, రుక్కమ్మ, లక్ష్మి, నర్సింహులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

- డీఎస్పీ రఘు
- ముమ్మరంగా వాహనాల తనిఖీ

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న చలాన్లను వెంటనే చెల్లించాలని డీఎస్పీ రఘు అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని జేసీ బ్రదర్స్ షాపింగ్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో నాలుగు టీంలుగా ఏర్పడి గురువారం మెగా వెహికల్ చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 89 వాహనాలపై రూ.89,500 వేల నగదును వసూలు చేశారు. హైదరాబాద్, బీదర్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లో నంబర్ ప్లేట్‌లు లేకుండా దొంగిలించిన వాహనాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ రఘు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనఖీలు నిర్వహించామన్నారు. పెండింగ్ చలాన్ల చెల్లింపుల్లో ప్రభుత్వం 80 శాతం రాయితో పాటు గడవు పొడిగించిందన్నారు. దీంతో పెండింగ్‌లో ఉన్న చలాన్లను వెంటనే చెల్లించాలని సూచించారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ రఘు, పోలీసు సిబ్బంది

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఖానాపూర్(కె)లో దేవునిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త చిన్నమొల్ల సంగవ్వకు బీఆర్‌ఎస్ తరఫున రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. సంగవ్వ భర్త సంగయ్య ఇటీవల మరణించడంతో పార్టీ సభ్యత్వం ఉండటంతో బీమా మంజూరైంది. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, నాయకులు మన్నే భూపాల్, సుధాకర్, నారాయణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


స్ట్రీట్‌లైట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. జిన్నారం మండల పరిధిలోని వావిలాల గ్రామానికి చెందిన నందిగామ నగేశ్ అందజేసిన స్ట్రీట్ లైట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో నగేశ్ భాగస్వామ్యం కావటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంతి, నవనీత్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసేవారికే గుర్తింపు


పదవీ విరమణ పొందినవారిని సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, సిబ్బంది

నారాయణఖేడ్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారికి ప్రజల్లో గుర్తింపు ఉంటుందని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఆర్టీసీ మెకానిక్ మునీర్, డ్రైవర్ విఠల్‌రెడ్డి పదవీ విరమణ పొందిన సందర్భంగా గురువారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. అనంతరం డీఎం మల్లేశయ్య మాట్లాడుతూ ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం, మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ ఉద్యోగుల లక్ష్యం కావాలన్నారు. మెకానికల్ ఇంజనీర్ దశరథ్‌రావు, ఆర్టీసీ సీఐ నర్సింహులు, సూపర్‌వైజర్ అజీం, ఆసిఫ్, సూపరింటెండెంట్ ప్రవీణ్, నెహ్రూనాయక్, కిషన్ ప్రసాద్, వీరయ్య, శ్రీను పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య భవనం ప్రారంభం


మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని బ్యాతోల్‌లో రూ.28 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం, సీసీ రోడ్లను జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ శిరీష మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జెడ్పీటీసీ సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అనంతరం పదవీ కాలం పూర్తయిన సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రషర్ల నిర్వహణపై విచారణ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కంకర క్రషర్ల నిర్వహణపై మైనింగ్, రెవెన్యూ, పీసీబీ అధికారులు సంయుక్తంగా ఆర్డీఓ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖాజీపల్లి, సోలక్‌పల్లి, రాళ్లకత్వ, శివానగర్, మాదారం గ్రామాల పరిధిలోని 42 కంకర క్రషర్‌లపై విచారణ గురువారం చేపట్టారు. ఐదు బృందాలుగా ఏర్పడి క్రషర్‌ల నిర్వహణ, కేటాయించిన భూమి, బ్లాస్టింగ్ విషయాలపై విచారణ జరుపుతున్నారు. రెండు రోజుల పాటు విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆర్డీఓ జయప్రకాశ్ నారాయణ తెలిపారు.

ఐఎన్‌టీయూసీని గెలిపించండి

పటాన్‌చెరు టౌన్: ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం అఖిలభారత అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమల్లో ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో భాగంగా గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంజీవరెడ్డి మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను చట్టాలను కాలరాస్తోందన్నారు. దీంతో అన్ని కార్మిక సంఘాలను ఒక తాటిపైకి చేర్చి వారి హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ పోరాటం చేస్తోందని తెలిపారు. ఏషియన్ పెయింట్స్ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా ఐఎన్‌టీయూసీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ జాతీయ నాయకులు సుదర్శన్‌రావు, అఖిలభారత ఐఎన్‌టీయూసీ యువత కన్వీనర్ సత్యజిత్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, కరుణాకర్‌రెడ్డి, మహేష్, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంజీవరెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సహజం


ట్రోఫీని ప్రదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ఉజ్వల్‌రెడ్డి అన్నారు. ఐదు రోజులుగా నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఝరాసంగానికి చెందిన రెండు జట్లు హోరాహోరిగా తలపడగా విన్నర్‌గా నిలిచిన ఝరాసంగం ఫ్రెండ్స్ టీం జట్టుకు రూ.51వేలు నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన చరణ్ సీసీ ఝరాసంగం టీంకు రూ.31వేల నగదుతో పాటు ట్రోఫీని ప్రదానం చేశారు. గెలిచిన జట్లుకు త్వరలో నియోజకవర్గ స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, కోహీర్ మండల అధ్యక్షుడు రాంలింగారెడ్డి, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీనియర్‌నాయకులు గొల్లభాస్కర్, సంగన్న, బస్వరాజ్ పాటిల్, సంగ్రాం పాటిల్, మారుతిరావు పాటిల్, అశ్రఫ్‌అలీ, వాహెద్ అలీ, మల్లికార్జున్ పాటిల్, లియాఖత్‌అలీ, రాజేందర్‌సింగ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌పాటిల్, నిర్వాహకులు ఫక్రొద్దీన్, రవూఫ్, మతిన్, మోహన్, ఇస్రావుల్ తదితరులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి గురువారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ గిరిధర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌లతో కలిసి సమావేశమయ్యారు. పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ వ్యవహారాల గురించి చర్చించినట్లు సమాచారం.


దీపాదాస్ మున్షీని కలిసిన ఉజ్వల్‌రెడ్డి, నాయకులు

విద్యార్థిని అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థిని అదృశ్యమైన ఘటన రామచంద్రాపురం పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నే అంజలి(19) పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గత నెల 31వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి అంజలి భోజనం చేసి పడుకుంది. గురువారం ఉదయం కుటుంబసభ్యులు లేచి చూసేసరికి అంజలి కనిపించలేదు. ఆచూకీ కోసం చుట్టు పక్కల బంధుమిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

జోగిపేట(అందోల్): అందోల్, జోగిపేట మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు బాయికాడి ఆంజనేయులు (55) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు కొంతకాలంగా మున్సిపల్ కార్యాలయంలో వాటర్ సప్లై విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ మేరకు ఆంజనేయులు అంత్యక్రియలకు గాను మున్సిపాలిటీ తరఫున చైర్మన్ మల్లయ్య రూ.10వేలు, జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పట్లూరి శివశేఖర్ సంఘం తరఫున రూ.5వేలను అందజేశారు. 12వ వార్డు కౌన్సిలర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ తిరుపతయ్య మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

ఘనంగా మడివాళ మాచదేవుడి జయంతి

జహీరాబాద్: రజకుల ఆరాధ్యదైవమైన మడివాళ మాచిదేవుడి జయంతిని రంజోల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాచిదేవుడి విగ్రహానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, రజక సంఘం నాయకులు నివాళులర్పించారు.

న్యాల్‌కల్‌లో..

(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్, గుంజోటి, న్యాల్‌కల్, రాంతీర్థ్ తదితర గ్రామాల్లో మడివాళ మాచిదేవా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాచిదేవుడి విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప, రజక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో అధికారికి రెండు మూడు పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. మండలంలోని అల్గోల్, దిడ్డి, కోత్తూర్(బి) పంచాయతీలకు ఎంఈఓ బస్వరాజ్,కాశీంపూర్, రాయిపల్లి(డి) తుంకుంటలకు మండల పరిషత్ అధికారి మహేశ్వర్‌రావు, బూచినెల్లి, బుర్దిపాడ్‌లకు పంచాయత్‌రాజ్ ఏఈ. కోటేశ్వర్‌రావు, హోతి(బి), మధులైతండాలకు పశువైద్యాధికారి వసంత్‌కుమారి, గోవింద్‌పూర్, హుగ్గెల్లి, హుగ్గెల్లి తండాలకు ఎంపీడీఓ సుమతి, శేఖాపూర్, శేఖాపూర్ తండాలకు తహసీల్దార్ రవీందర్, మల్‌చెల్మ, మల్‌చెల్మ తండాలకు వ్యవసాయ అధికారిణి ప్రవీణ,చిరాగ్‌పల్లి, సత్వార్‌లకు ఆర్‌అండ్‌బీ డీఈఈ నర్సింలు, అర్జున్ నాయక్ తండా, లచ్చునాయక్ తండా, ఆనేగుంట పంచాయతీలకు డిప్యూటీ తహసీల్దార్ వంశీధర్‌ను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు.

కల్హేర్(నారాయణఖేడ్): సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కల్హేర్ మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు నియామకమయ్యారు. కల్హేర్, పోమ్యానాయక్ తండా, బీబీపేట జీపీలకు డీపీఓ నర్సింహరావు, కృష్ణాపూర్, అలీఖాన్‌పల్లి, ఖానాపూర్(బి) జీపీలకు తహసీల్దార్ బాలశంకర్, బాచేపల్లి, మునిగేపల్లి, రాంచందర్ తండా జీపీలకు ఎంపీఓ శ్రీనివాస్, మీర్ఖాన్‌పేట, రాపర్తి జీపీలకు ఎంఈఓ శంకర్, ఖానాపూర్(కె), జంలాతండా జీపీలకు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమోహన్, ఇందిరానగర్, మార్డి జీపీలకు వెటర్నరి అసిస్టెంట్ గీతా, దామరచెరువు, మొదల్లకుంట తండా, నాగధర్ జీపీలకు ట్రాన్స్‌కో ఏఈ నారాయణ, మహదేవుపల్లి, బలకంచెల్క తండా జీపీలకు ఏఈ ఇరిగేషన్ సూర్యకాంత్, కల్వనికుంట తండా, నాగనికుంట తండా, రాంరెడ్డిపేట జీపీలకు ఏఈ మిషన్ భగీరథ శ్రీకాంత్, దేవునిపల్లి, మాసాన్‌పల్లి, ఫత్తేపూర్ జీపీలకు డీఈఈ ఇరిగేషన్ జలంధర్ ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు.

మునిపల్లి(అందోల్): సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీలకు స్పెషల్ అధికారులను గురువారం నియమించిందని ఎంపీడీఓ హరినందన్‌రావు తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి మండల, గ్రామ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మునిపల్లి మండల ప్రత్యేకాధికారిగా రామాచారిని ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో కిషన్‌కు ప్రథమ స్థానం

కల్హేర్(నారాయణఖేడ్): డిప్లొమా ఇన్ కో–ఆపరేటివ్ మేనేజ్మెంట్ కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు 7వ బ్యాచ్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బీబీపేట ప్రాథమిక సహకార సంఘం నుంచి కిషన్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాడు. నాబార్డ్ గైడ్ లైన్స్ ప్రకారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు గన్‌ఫౌండ్రీ హైదరాబాద్‌లో తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ కార్యాలయంలో చేయవలసిన 5 నెలల డిప్లొమా ఇన్ కో ఆపరేటివ్ మేనేజ్మెంట్ కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు చేశాడు. ప్రథమ స్థానంలో నిలిచిన కిషన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ భూక్య వెంకన్న అభినందించారు. సొసైటీలో ఉద్యోగ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించి సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు.


కిషన్

క్యాలెండర్ ఆవిష్కరణ

సదాశివపేట(సంగారెడ్డి): వికలాంగులందరూ చట్టాలను సద్వినియోగించుకోవాలని పీఎంఆర్ ట్రస్ట్ అధినేత, బీజేపీ సంగారెడ్డి నియోజకవర్గ నాయకుడు పులిమామిడి రాజు అన్నారు. పట్టణంలోని పీఎంఆర్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ఎన్‌పీఆర్డీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, డివిజన్ కార్యదర్శి వెంకయ్య, సహాయ కార్యదర్శి బాలయ్య, మండల అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి కిష్టయ్య, నాయకులు మైపాల్, అబ్దుల్లా, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊరడమ్మ జాతర

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని గోపన్‌పల్లి గ్రామంలో ఊరడమ్మ జాతరను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ స్వేతసీతారాంరెడ్డి, ఎంపీటీసీ రాంచందర్, అసద్‌గంజ్ సర్పంచ్ ఓంకార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గద్దర్ జయంతి సభ విజయవంతం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గద్దర్ జయంతి సందర్భంగా గద్దర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెల్లాపూర్ స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెల్లాపూర్‌లో ఏర్పాటుచేసిన గద్దర్ విగ్రహ ఏర్పాటు వెనుక అనేకమంది కృషి ఉందన్నారు. ప్రధానంగా తెల్లాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు రాజకీయ పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా తీర్మానం చేయడం హర్షనీయమని తెలిపారు. అందుకు చైర్‌పర్సన్‌తో పాటు తన తోటి కౌన్సిలర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

◆ వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: మానసికస్థితి సరిగాలేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్ తండాకు చెందిన రాగ్య(46) కొంతకాలంగా ఫిట్స్‌తో పాటు మానసిక స్థితి సరిగాలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జనవరి 28వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు రాగ్య కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం తండ్రి అదృశ్యంపై కుమారుడు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ కంకర క్రషర్ సీజ్

మునిపల్లి(అందోల్): మండలంలోని చీలపల్లి గ్రామ శివారులో ఉన్న కంకర క్రషర్‌ను అధికారులు గురువారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకుని చీలపల్లి గ్రామస్తులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుడదనే క్రషర్‌ను సీజ్ చేయించారని తెలిపారు. క్రషర్‌పై మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి 13 డిసెంబర్ 2023న అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు.

◆ బాలికల హక్కులపై అవగాహన

హత్నూర(సంగారెడ్డి): హత్నూర కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో బాలికలకు ఆరోగ్యం బాలికల హక్కులపై ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యంపై అశ్రద్ధ వహించవద్దని సూచించారు. బాలికల హక్కులపై అవగాహన ఉండాలన్నారు. వారం రోజుల పాటు పరిచయ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జయలక్ష్మి తెలిపారు.

◆ సర్పంచ్‌లకు సన్మానం

కంది(సంగారెడ్డి): గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమైందని ఎంపీపీ సరళ పుల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎద్దుమైలారం గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లారెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీలు వరకుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, యాదగిరి, కుర్మ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

◆ బిల్లులు చెల్లించండి

నారాయణఖేడ్: మన ఊరు.. మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని నారాయణఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మిబాయి, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పాఠశాలల యాజమాన్య కమిటీల బాధ్యులు అప్పులుచేసి పనులు చేశారన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు.

◆ రోడ్డు భద్రతపై అవగాహన

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలో రోడ్డు భద్రత మాసంలో భాగంగా జాతీయ రహదారి భద్రతపై వాహనదారులకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 161 జాతీయ రహదారి మేనేజర్ మోహిన్, ఖేడ్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, నిజాంపేట్ సర్పంచ్ జగదీశ్వరాచారి, ఎంపీటీసీ సబితాలింగారెడ్డి, ఉపసర్పంచ్ రాంచందర్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

◆ సూక్ష్మపోషకాలపై రైతులకు అవగాహన

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని కాసాల రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు సూక్ష్మ పోషకాల మీద గురువారం రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో వరి పంటలో సూక్ష్మ పోషక లోపాలను ఏ విధంగా అధిగమించవచ్చు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సైంటిస్ట్ డాక్టర్ సుకత్ కుమార్, ఏడీఏ అరుణ, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏఈవోలు ప్రేమ్‌రాజ్, స్రవంతి పాల్గొన్నారు.

◆ ప్రజాప్రతినిధులకు సన్మానం

మునిపలి(అందోల్): సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో మల్లికార్జునపల్లి, మల్లారెడ్డిపేట, బొడ్పట్‌పల్లి తదితర గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ కొత్త తరానికి చిరుధాన్యాలు పరిచయం చేయాలి

జహీరాబాద్: కొత్త తరానికి చిరుధాన్యాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అల్గోల్ సర్పంచ్ జ్యోతిమోహన్ అన్నారు. మండల పరిధిలోని అల్గోల్ గ్రామంలో పాత పంటల జాతరను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన జాతర ఎడ్లబండ్ల ఊరేగింపునకు స్వాగతం పలికి నైవేద్యాలు సమర్పించారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: ఖేడ్‌లోని శ్రీరామమందిరం పాలకవర్గ మండలి ఏర్పాటు కోసం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉప కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లో తమ దరఖాస్తులను హైదరాబాద్‌లోని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఉప కమిషనరు కార్యాలయం, సంగారెడ్డిలోని సహాయ కమిషనరు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు సంగారెడ్డిలోని సహాయ కమిషనరు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

◆ స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రైవేట్ రంగంలో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకుడు పట్లోళ్ల రవీందర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు కాకుండా, స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని వాపోయారు. జిల్లాలో వందల సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు చేసినా స్థానికులకు ఉద్యోగాలు కల్పించడం లేదన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.